క్లుప్తంగా

సెల్‌ఫోన్ రిపేరులో ఉచిత శిక్షణ

టంగుటూరు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకి ఒంగోలు లోని రూడ్ సెట్ సంస్థలో మార్చి 11వ తేదీ నుంచి 30 రోజులు పాటు సెల్‌ఫోన్ రిపేరులో ఉచిత శిక్షణ ఇస్తారని సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ శుక్రవారం ఏపీఎం కార్యాలయంలో ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో 19-45 ఏళ్ల వయసు ఉండి, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. అలాగే రేషన్ కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తారని, పేర్లు నమోదు, ఇతర వివరాలకు 95733 63141 నంబరులో సంప్రదించాలని ఆయన ప్రకటనలో కోరారు.

గాలికుంటు వ్యాధి టీకాలు పంపిణీ

పొన్నలూరు: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం ప్రతి గ్రామంలో శనివారం నుంచి మార్చి 30 వరకు గాలికుంటు వ్యాధి టీకాలు అందిస్తున్నట్లు చౌటపాలెం పశువైద్యాధికారి శివరామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన గేదెలకు పాల ఉత్పత్తి, పనిసామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. అలాగే చూడి గేదెలు ఈసుకపోవడం, పాలు తాగే దూడలు మరణిస్తాయన్నారు. కనుక ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోని పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

వేడుకగా పేరంటాలమ్మ తల్లి ఉత్సవం

పీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మి అడవిలో వెలసిన అడవి పేరంటాలమ్మ తల్లి నాలుగో రోజు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మూల్ విరాట్‌ను గుడి చుట్టూ తిప్పుతూ బొల్లావులతో పలు నృత్యాలు చేశారు. శనివారం గ్రామంలోకి ఊరేగింపుగా తీసుకొచ్చి బ్రహ్మోత్సవం నిర్వహించి తిరునాళ్లను ఘనంగా నిర్వహించుకుంటారు. ఈఏడాది పోలు జయరాంరెడ్డి, గణేష్‌రెడ్డిలు తిరునాళ్ల పూర్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నేరేడువెల్లి గ్రామంలో వెలసిన అడవి పేరంటాలమ్మ తల్లి తిరునాళ్లు కూడా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

పామూరు: విద్యుదాఘాతంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బొట్లగూడూరు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. బొట్లగూడూరు సమీపంలోని ఓ ప్రాంతంలో బోర్ వేసేందుకు బోర్ మిషన్‌ను సిద్ధం చేస్తున్న తరుణంలో ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్‌లైన్ తీగలు మిషన్‌కు తగిలాయి. ఆపరేటర్‌గా ఉన్న బాలాజీ నాయక్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఘటనలో చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రుని కందుకూరు వైద్యశాలకు తరలించారు.

మహిళల సమస్యలు పరిష్కరించాలి



పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

సింగరాయకొండ: మహిళల సమస్యలను సత్వరమే పరిష్కరించి వారికి అండగా నిలవాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మొదట కార్యాలయ రికార్డులను తనిఖీ చేసి స్టేషన్ లోపల గదులను, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత మహిళా సహాయ కేంద్రాన్ని పరిశీలించారు. సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బీ మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ నిరసిస్తూ ధర్నా

పామూరు: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్ ముమ్మాటికి రైతు, ప్రజావ్యతిరేక బడ్జెట్ అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ అన్నారు. పశ్చిమప్రాంత వరప్రసాదిని పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు, పాలేటిపల్లి రిజర్వాయర్‌కు నామమాత్రపు నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాత్రి స్థానిక సుందరయ్య భవన్ సెంటర్‌లో సీపీఎం శ్రేణులు ధార్నా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ బడ్జెట్‌లో నిధుల కేటాయింపును రివైజ్ చేసి వెలుగొండ ప్రాజెక్టుకు రు.2 వేల కోట్లు కోటాయించాలని, అదేవిధంగా పీసీపల్లి మండలంలోని పాలేటిపల్లి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. అదేవిధంగా సూపర్‌సిక్స్ పథకాలకు నిధులు పెంచి అమలుచేయాలని లేకపోతే ప్రజాఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్.ఖాదర్‌బాషా, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కే.మాల్యాద్రి, వై.వి.నారాయణ, పి.రామయ్య రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- కనిగిరి నియోజకవర్గంలో తొలిరోజు హాజరు కానున్న 2,500 వేల మంది విద్యార్థులు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికార యంత్రాంగం



పరీక్షలకు సిద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులు (ఫైల్)



పొన్నలూరు పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



కొండపిలో పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్

కనిగిరిరూరల్:

విద్యార్థులకు కీలకమైన రెండోమెట్టు ఇంటర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం అవనున్నాయి. మార్చి 1 నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు, 3 నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు హాజరు కావాలని, 8.30 నిమిషాలకు గదుల్లో విద్యార్థులకు ఓఎంఆర్ షీట్లు అందజేస్తారని కస్టోడియన్ వెంకటేశ్వరరావు తెలిపారు. 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. తొలి రోజు తెలుగు, సంస్కృతం, ఉర్దూ, హిందీ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఒకేషనల్ గ్రూప్ పరిక్షలు రాసే విద్యార్థులు కనిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలోనే పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులంతా హాల్ టికెట్లు తీసుకుని రావాలని సూచించారు. కనిగిరి పట్టణంలో 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో సుమారు 1,414 మంది తొలి రోజు పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎంఎస్ఎం, నేతాజీ, కృష్ణ చైతన్య, ఎంఎస్ఆర్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పామూరులో 3 కేంద్రాల్లో, సీఎస్‌పురంలో 1 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాస్తారని అధికారులు తెలిపారు.

కొండపి నియోజకవర్గంలో..

కొండపి/పొన్నలూరు: ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని చీఫ్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించామని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 320 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 277 మంది హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రంలోని ప్రతి రూముకి సీసీ కెమెరా పర్యవేక్షణ ఉందని, పరీక్ష జరిగే సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయన తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో నాలుగు కాలేజీల విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది,పరీక్షలకు కేటాయించిన సిబ్బంది పాల్గొన్నారు.

☛ పొన్నలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు సెంటర్ చీఫ్ రాజేంద్ర బాబు తెలిపారు. ఈ ఏడాది జూనియర్ కళాశాల విద్యార్థులు 52 మంది, కేజీబీవీ మాలపాడు విద్యార్థినులు 33 మంది, మొత్తం 85 మంది హాజరవుతున్నారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో పొన్నలూరు జూనియర్ కళాశాల విద్యార్థులు 47 మంది, కేజీబీవీ మాలపాడు విద్యార్థినులు 21 మంది హాజరవుతారు. ఇందుకు గాను మొత్తం 3 గదులను ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

విశ్వ మానవాళి సంక్షేమం కోసమే సైన్స్



కొండపిలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠశాల సిబ్బంది



కలికవాయలో సైన్స్ ప్రదర్శనలు తిలకిస్తున్న ఎంపీడీవో జయమణి



గార్లపేట హైస్కూల్‌లో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్



జమ్ములపాలెంలో సైన్స్ ప్రాజెక్టులతో విద్యార్థులు



కనిగిరిలో సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు



హెచ్‌ఎంపాడులో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



సీఎంఎస్‌పురం కేజీబీవీలో రామన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు

కొండపి/మద్దిపూడి/పొన్నలూరు/టంగుటూరు/సింగరాయకొండ: ప్రపంచాన్ని శాసిస్తూ నడిపించే శక్తిగా సైన్స్ కీలక పాత్ర పోషిస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ సైన్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. కొండపి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో హెచ్‌ఎం బీ సూసన్నకుమార్ మాట్లాడుతూ ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ 1928 ఫిబ్రవరి 28న తన ప్రఖ్యాత రామన్ ఎఫెక్ట్ కనుగొన్న కారణంగా నేషనల్ సైన్స్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 1987లో అధికారికంగా ఆమోదించిందన్నారు. ముందుగా సీవీ రామన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ మాజీ చైర్మన్ రాఘవేంద్ర శర్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

☛ మద్దిపూడి మండలంలోని గార్లపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఇన్‌చార్జిహెచ్‌ఎం రమేష్ ఆధ్వర్యంలో సైన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఎగ్జిబిషన్ తయారుచేసి, ప్రదర్శించారు. ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, మనోహరులు సీవీ రామన్ గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాం మురళి, ఆదినారాయణ, గౌస్‌బాషా, నాగప్రసాదు, స్వర్ణశ్రీ, అమరేశ్వరి, రమాదేవిలు పాల్గొన్నారు.

☛ టంగుటూరు జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, పీడీ తుల్లిబిల్లి ఆశోకు, సైన్స్ ఉపాధ్యాయులు వాసంతి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

☛ సింగరాయకొండ మండలంలోని కలికవాయ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలను ఎంపీడీవో జయమణి స్వయంగా పరిశీలించి అభినందించారు. రాబోయే రోజుల్లో సాంకేతికతను అందిపుచ్చుకున్నవాడే అన్ని రంగాల్లో రాణించగలడని ఆశాభావం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం నిడమానూరి సురేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానం కలిగి ఉండాలి..

కనిగిరిరూరల్/పామూరు/హనుమంతునిపాడు/పీసీపల్లి/సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానం కలిగి ఉండాలని ఎంఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు యువీ నారాయణరెడ్డి, ఆర్ శ్రీనివాసులు అన్నారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన సైన్స్‌ఫేర్ ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎర్రం రెడ్డి ప్రమీల కుమారి, అరుణ కుమారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. చల్లగిరిగిల్ల, చింతలపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

☛ హనుమంతునిపాడు మండంలో జాతీయ సైన్స్‌డే సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. సైన్స్ ప్రాజెక్టుల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్ రమణయ్య, హెచ్‌ఎంలు బొప్పరాజు సుబ్బారావు, సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

☛ విద్యార్థుల్లోని విద్య, వైజ్ఞానిక శక్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని హెచ్‌ఎం ఎం.జయకుమార్ అన్నారు. సైన్స్ డేను మండల కేంద్రమైన పామూరులో రామన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

☛ సీఎస్‌పురం కేజీబీవీ విద్యాలయంలో శుక్రవారం ఎస్‌ఓ షేక్.రేష్మ అధ్యక్షతన సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు ప్రాజెక్ట్‌ల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ

- బడ్జెట్‌పై నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల ధ్వజం



మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: రాష్ట్ర బడ్జెట్ ఓ అంకెల గారడీ అని.. కూటమి సర్కార్ సూపర్ సిక్స్ పథకాలకు చిల్లు పెట్టిందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ధ్వజమెత్తారు. స్థానిక కార్యాలయంలో ఆయన శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025-26 వార్షిక బడ్జెట్ అంతా మోసం అన్నారు. చంద్రబాబు సర్కార్ మరోసారి తన మోసపూరిత నైజాన్ని చాటుకుందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తామని చెప్పానే బడ్జెట్‌లో కేటాయింపులు మాత్రం అరకొరగా చేశారన్నారు. ఈ రెండు పథకాల్లోనూ భారీగా లబ్ధిదారులను కోత పెట్టడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. దానికి బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదన్నారు. ప్రజలు ప్రశ్నిస్తారేమోనన్న భయంతో కంటితుడుపు చర్యగా బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేసినట్లు స్పష్టమవుతోందని వివరించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల ప్రసంగం అంతా ఆత్మస్తుతి, పరనిందలా సాగిందని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌ను పొగడటానికే ఆయన పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ఆర్టీసీ బస్సు, డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణం ఇస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు బడ్జెట్లో దానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, దీంతో లక్షలాది మంది మహిళలను బాబు ఎప్పట్లానే మోసం చేశారన్నారు. గత ఎన్నికల సమయంలో జగన్ కన్నా ఎక్కువ సంక్షేమం, పథకాలు అందిస్తామని నమ్మించి ఓట్లేయించుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు చివరకు మేనిఫెస్టోలో పెట్టిన హామీలనే అమలు చేయలేని దుస్థితికి వచ్చారన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అని ఈ బడ్జెట్ తో మరోమారు రుజువైందని ధ్వజమెత్తారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి



డీఏఓకు వినతి పత్రం అందచేస్తున్న ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ నాయకులు

కనిగిరిరూరల్: పశు వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం ఆర్డీవో ఆఫీసులోని డీఏవో బాలాజీకి వినతి పత్రం అందచేశారు. అనంతరం వైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీ ప్రభాకర్ మాట్లాడుతూ వెంకటేశ్వర పశువైద్య విద్యాలయ అనుబంధ కళాశాలల విద్యార్థులు ఫిబ్రవరి 3 నుంచి సమస్య పరిష్కారానికి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. వారి సమస్యలను మంత్రులకు విన్నవించినా.. ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. సమస్యలపై నిర్లక్ష్యం వీడి చర్యలు తీసుకోవాలన్నారు. పశు వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎఫ్, ఎస్ఎఫ్ నాయకులు పోతల ప్రభాకర్, పుట్టా సుబ్బారావు, పూర్ణ చంద్రరాజు, సీహెచ్ పవన్ కుమార్, గూడూరి సురేష్, ఖాశింపీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- జిల్లా మలేరియా నివారణ అధికారి మధుసూదన్‌రావు



గ్రామాల్లో పర్యటిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి

కనిగిరిరూరల్: ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఎస్ మధుసూదన్‌రావు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కనిగిరి పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు, సూపర్‌వైజర్ ఉమా మహేశ్వరరావు, రమణయ్య, శైలజ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



జెండా ఆవిష్కరిస్తున్న టైలర్స్ సంఘ నాయకులు

పామూరు: దర్జీలందరూ ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాడినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని టైలర్స్ సంఘం నాయకుల రాగిపాటి రమేష్ అన్నారు. టైలర్స్‌డే వేడుకలను శుక్రవారం స్థానిక పొట్టి శ్రీరాములు వీధిలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం టైలర్ల సంక్షేమంపై దృష్టిసారించి వడ్డీ లేని రుణాలుకాని, లేదా తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ముందుగా కుట్టు మిషన్ సృష్టికర్త విలియన్స్ హోవే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి అనంతరం టైలర్స్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రసూల్, ప్రసాద్, నాగూర్, రాజేష్, మల్లికార్జున, టైలర్లు పాల్గొన్నారు.

సీఎం కార్యాలయం నుంచి అంటూ ఫోన్..

టంగుటూరు: సైబర్ నేరగాళ్ల మితిమీరిపోతున్నారు. సీఎం కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం అంటూ టంగుటూరు తహసీల్దార్ ఆంజనేయులుకు దుండగులు శుక్రవారం కాల్ చేశారు. 96528 37239 నంబరు నుంచి ఫోను చేసి తాము సీఎంవో కార్యాలయం నుంచి అంటూ మీ మండల సర్వేయర్‌ని ఒకసారి ఫోను చేయమని చెప్పు అని బిగ్గరగా అరిచారని చెప్పారు. దీంతో అప్రమత్తమైన తహసీల్దార్ ఇది సైబర్ నేరగాళ్ల పని అని గ్రహించి ఫోన్ కట్ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇదే నంబరు నుంచి రెండు, మూడు సార్లు ఫోను కాల్ వచ్చిందని తెలిపారు. ప్రజలు ఇలాంటి కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

అక్షయ్‌గోల్డ్ భూముల్లో జామాయిల్ కర్ర పట్టివేత

వెలిగండ్ల(కనిగిరిరూరల్): వెలిగండ్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో గల అక్షయ్ గోల్డ్ భూముల్లో ఉన్న జామాయిల్ కర్రను అక్రమంగా నరికి తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. గ్రామాల్లో మొత్తం 5 సర్వే నెంబర్లలో గల జామాయిల్ కర్రను కొట్టి లారీకి లోడ్ చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలుసుకుని, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు వెలిగండ్ల పోలీసులు లారీని, పలువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

నిస్వార్థ ప్రజాసేవకులకు నివాళులు

కనిగిరిరూరల్: వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ నీటి సమస్య పరిష్కరించడంలో పాలకులు విఫలం చెందారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పమిడి కోటయ్య, తవనం చెంచయ్య, సూరా పాపిరెడ్డి, ఏనుగుల పుల్లయ్యల వర్ధంతి సభ జరిగింది. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది ఎమ్మెల్యేలు, చైర్మన్లు, సర్పంచ్‌లు మారినా కనిగిరి పట్టణంలో తాగు నీటి సమస్య పరిష్కరించక పోవడాన్ని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పిల్లి తిప్పారెడ్డి, పి మహేష్, ఎస్‌కే బషీరా తదితరులు పాల్గొన్నారు.

పామూరు: నిస్వార్థ ప్రజాసేవకులు దివంగత సూరా పాపిరెడ్డి, తవనం చెంచయ్య, పమిడి కోటయ్యలు అందరికీ ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పాపిరెడ్డి, చెంచయ్య, కోటయ్యల వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మాల్యాద్రి, కాశీ శంకర్, వెంకటేశ్వర్లు, వై.వీరనారాయణ, ఖాదర్‌బాషా నాయకులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.27.95 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.27.95 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వి.ఉష తెలిపారు. స్థానిక ఆలయ ప్రాంగణ భవనంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, ఆలయ చైర్మన్, ఈఓల పర్యవేక్షణలో శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీల ద్వారా రూ.16,86,692, టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.2,83,280, లడ్డు ప్రసాదం విక్రయం ద్వారా రూ.2,42,910, అన్నదానానికి విరాళంగా రూ.2,93,717, మహా ప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ.1,07,717, ఉభయదాతల విరాళాల కింద రూ.1,80,696 వెరసి మొత్తం రూ.27,95,012 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, అర్చకులు పాల్గొన్నారు.

బావిలో పడి యువకుడు మృతి

సింగరాయకొండ: ప్రమాదవశాత్తు యువకుడు కుందుర్తి సుధీర్ (29) బావిలో పడి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని బింగినపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కావలిలోని పాతమాలపల్లి గ్రామానికి చెందిన సుధీర్ తన తల్లికి ఆరోగ్యం బాగా లేకపోవటంతో స్థానిక డాక్టర్ శివరామిరెడ్డి హాస్పిటల్‌లో చికిత్స చేయిస్తూ బింగినపల్లిలోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో బహిర్భూమికి వెళ్లి అక్కడ ఉన్న బావిపై కూర్చొనే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన పై కేసు రిజిస్టరు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై బీ మహేంద్ర వివరించారు.